

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి

ప్రజాశక్తి - కురుపాం

ఉపాది హామీ కూలీలపై తేనెటీగల దాడి జరిగిన సంఘటన గురువారం సాయంత్రం మండల కేంద్రంలో గల శివన్నపేటలో చోటుచేసుకుంది. జిల్లా కోఆప్షన్ సభ్యులు షేక్ నిసార్ సంఘటన తెలుసుకొని వెంటనే పని జరుగుతున్న ప్రదేశానికి వెళ్లి కూలీలను సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి దగ్గరుండి ప్రత్యేక వైద్యాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన అందించిన వివరాలు ప్రకారం శివన్నపేట గ్రామం పరిధిలోగల ఏకలవ్య పాఠశాల సమీపంలో జరుగుతున్న ఉపాధి పనిలో శివన్నపేట గ్రామానికి చెందిన ఆర్. గౌరీ, ఎం. లక్ష్మి, ఎం. జగదీశ్వరి, విగ్నేశ్వరరావులపై ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. వీరికి ప్రస్తుతం వైద్యం అందుతుంది.

ఆర్ఒఎఫ్ఆర్ పట్టాదారులకు పంట రుణాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి -పార్వతీపురం

ఆర్ఒఎఫ్ఆర్ పట్టాదారులకు పంట రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కోరారు. ఆర్ఒఎఫ్ఆర్ పట్టాదారులకు పంట రుణాలు మంజూరులో బ్యాంకర్లు వెనుకంజ వేస్తున్నారని, దీనిపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని ఆయన కోరారు. దీనిపై ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్. జవహర్ రెడ్డి స్పందిస్తూ వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేదికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బ్యాంకర్లు, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శితో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి తెలిపారు. జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గృహ నిర్మాణం, వ్యవసాయం తదితర అంశాలను సమీక్షించారు. జగనన్న పాల వెల్లువ కింద కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్, డిఆర్ఒ జె.వెంకట రావు, డిఆర్‌డిఎ, హౌసింగ్ పీడీలు పి.కిరణ్‌కుమార్, రమేష్, ఆర్‌డబ్ల్యుఎస్ జిల్లా ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, జిల్లా పశుసంవర్ధక అధికారి ఎ.ఈశ్వర రావు, డిపిఒ బి.సత్యనారాయణ, జిల్లా ఉద్యాన అధికారి కెవిఎస్ఎన్ రెడ్డి, జిల్లా సహకార అధికారి సన్యాసి నాయుడు, జిల్లా మత్స్య శాఖ అధికారి వి.తిరుపతయ్య, ఎపిఎంఐపి పిడి ఎల్.శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్‌పాల్, జిల్లా సర్వే సెటిల్మెంట్ అధికారి కె.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇవిఎం గోడౌన్లు సిద్ధం చేయాలి

పార్వతీపురం : ఇవిఎం గోడౌన్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించాలని, ప్రస్తుతం వినియోగిస్తున్న వాటికి మరమ్మతులు చేసి సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా జిల్లా కలెక్టర్లను కోరారు. గురువారం జిల్లా కలెక్టర్లు, జెసితో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియోకాన్ఫరెన్స్ లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఈ ఏడాది మార్చి 31నాటికి గల క్లెయిమ్స్, అభ్యంతరాలు వెంటనే క్లియర్ చేయాలని తెలిపారు. ఓటరు జాబితాలో చేర్పులు, తొలగింపులు జూన్ నాటికి పూర్తిచేయాలన్నారు. కొత్తగా ఇవిఎం గోడౌన్ నిర్మించాల్సిన చోట ప్రతిపాదనలు పంపించాలని, ప్రస్తుతం వినియోగిస్తున్న గోడౌన్లకు మరమ్మతులు చేయించాలని తెలిపారు. జూన్ నుంచి ఇవిఎం సరఫరా జరుగుతుం దని, సెప్టెంబర్ నాటికి కేటాయించిన మొత్తం ఇవిఎంలను అందజేయడం జరుగుతుందన్నారు. ఇవిఎంపై సిబ్బందికి శిక్షణ అందించాలని సూచిం చారు.జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సంబం ధించిన ప్రణాళికను జిల్లా కలెక్టర్లు తెలియజేశారు. వీడియో సమావేశంలో కలెక్టర్ నిశాంత్‌కుమార్, డిఆర్ఒ జె.వెంకటరావు, సూపరింటెండెంటు రవికుమార్ పాల్గొన్నారు.

సాగునీటి ప్రాజెక్టులపై శీతకన్ను



బహిరంగ సభకు హాజరైన జనాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న చంద్రబాబు

- ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వం
- బహిరంగ సభలో చంద్రబాబు
- చింతలపాలెం వద్ద ఘన స్వాగతం
- రోడ్డుషోకు పోటెత్తిన జనం
- పట్టణమంతా పసుపు మయం

"కొత్తవలసలో 500 ఎకరాలు గిరిజన యూనివర్సిటీకి కేటాయిస్తే దాన్ని మార్చేశారు. నేటికీ ఎక్కడా ప్రారంభించలేదు. కమీషన్లు అడగడం వల్ల పతంజలి సంస్థ కూడా వెనక్కి వెళ్లిపోయింది. తారకరామ పూర్తయి ఉంటే ఆ ప్రాంతం అభివృద్ధి అయ్యేది. రైవాడ రిజర్వాయర్ కాలువలను ఆధునీకరిస్తే ఈప్రాంత భూములకు నీరందుతుంది. తోటపల్లి ప్రాజెక్టు పనులు పూర్తి చేయలేని అసమర్థ ప్రభుత్వం."

-బహిరంగ సభలో చంద్రబాబు

ప్రజాశక్తి-శృంగవరపుకోట, లక్కవరపుకోట, వేపాడ, కొత్తవలస

ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులపై వైసిపి ప్రభుత్వం శీతకన్ను వేసిందని, తాను చేపట్టిన ప్రాజెక్టులేవీ పూర్తి చేయలేదని టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు అన్నారు. ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వమని ధ్వజమెత్తారు. ఇదేం ఖర్మ కార్యక్రమంలో భాగంగా గురువారం సాయంత్రం ఎస్.కోటలో రోడ్డుషో నిర్వహించారు. విశాఖ జిల్లా నుంచి విజయనగరం జిల్లాలో ప్రవేశించిన చంద్రబాబుకు కొత్తవలస మండలం చింతలపాలెం వద్ద టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పి.అశోక్ గజపతిరాజు, విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి భరత్, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, నాయకులు గొంపకృష్ణ, సాలూరు ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్‌దేవ్, ఆ గ్రామ సర్పంచ్ మాకేన సీతారాం పాత్రుడు (నీవన్), పలువురు టిడిపి నాయకులు స్వాగతం పలికారు. శృంగవరపుకోటలో భారీ వర్షం కారణంగా ఆయన పర్యటన ఆలస్యమైనప్పటికీ, దారిపొడవునా పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, ప్రజలు బారులు తీరారు.



కాన్వాయ్‌పైనుంచి అభివాదం చేస్తున్న చంద్రబాబు

తెలుగు తమ్ముళ్లు జెండాలు, ఫ్లెక్సీలు చేతబూని చంద్రబాబుకు మద్దతుగా నినాదాలు చేశారు. వారినుద్దేశించి చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో సైకో పాలన కొనసాగుతోందని, వైసిపి పాలనకు చరమగీతం పాడాలని అన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. ఎస్.కోటలోని సిరి రిసార్ట్‌కు చేరుకున్న బాబు, కొద్దిసేపటి తరువాత అక్కడి నుంచి దేవిబొమ్మ కూడలి వరకు మూడు కిలోమీటర్లు మేర రోడ్డు షో నిర్వహించారు. అడుగడుగునా చంద్రబాబుకు జనం స్వాగతం పలికారు.

అనంతరం దేవిబొమ్మ కూడలిలో జరిగిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ తాను అధికారంలో ఉన్నప్పుడు ఉత్తరాంధ్ర సుజల స్రవంతి మంజూరు చేశానని, గోదావరి నీరు వస్తే ప్రతిఎకరాకు నీరు వచ్చేదని, కానీ దాన్ని వైసిపి ప్రభుత్వం గాలికొదిలేసిందని అన్నారు. పెందుర్తినుంచి అరకు వరకు 4లైన్ల రోడ్డు వేస్తే ఈ ప్రాంతం అభివృద్ధి అయ్యేదని అన్నారు. తాము కట్టిన 7లక్షల 50వేల టిడ్కో ఇళ్ళు కూడా ప్రజలకు అప్పగించడం లేదన్నారు. అధికారంలోకి వచ్చాక పేటిఎం బ్యాచ్‌ను వదిలిపెట్టేది లేదని అన్నారు. గిరిజనులకు ఉద్యోగ అవకాశాల కోసం జీవో 3 ను తీసుకొస్తే సుప్రీంకోర్టులో కొట్టేసి గిరిజనులకు అన్యాయం చేశారని అన్నారు. గిరిజనులకు ప్రత్యేక డిఎస్‌సి పెట్టానని, కానీ నేడు ఉద్యోగాలు లేవని, పంటలకు గిట్టుబాటు ధర లేదని అన్నారు. ప్రధానంగా బిసిలకు రాజ్యాధికారం కల్పించి రుణం తీర్చుకుంటానని అన్నారు. సంపద సృష్టించి సంక్షేమ పథకాలు అమలు చేస్తానని తెలిపారు. పేదలకు, రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్న ఈ అవినీతి ప్రభుత్వాన్ని ఇంటికి పంపాలని కోరారు. రాష్ట్రం వదిలిపెట్టి పారిపోయేవరకు తరిమి కొట్టాలని అన్నారు. సభ వేదికపై మాజీఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, నాయకులు గొంప కృష్ణ, విశాఖపార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి భరత్ ఉన్నారు.

పకడ్బందీగా పరీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాలో ఈనెల 20న జరగబోయే గురుకుల పాఠశాలలు, రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశ పరీక్షలను పగడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు అధికారులకు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలిసి పరీక్ష ఏర్పాట్లు సమీక్షించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ జిల్లాలో 8 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పరీక్షా కేంద్రాల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్లను, అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. పురపాలక శాఖ అధికారులు ఒఆర్ఎస్ ప్యాకెట్లు, మంచినీటిని అన్ని కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే పరీక్షా కేంద్రాల వద్ద శానిటేషన్ చేసి, బ్లీచింగ్ వేయాలని ఆదేశించారు. పరీక్షలు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని ఆ సమయంలో అన్ని పరీక్షా కేంద్రాల వద్దా 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఇద్దరు మహిళా పోలీసులు, ఇద్దరు కానిస్టేబుల్స్ ను నియమించాలని పోలీసు శాఖ అధికారులను కోరారు. ఇన్విజిలేటర్లు, సూపర్వైజర్లు, పరీక్షలకు హాజరు అయ్యే అభ్యర్థులు ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రాలకు తీసుకురావద్దని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని పోలీస్ శాఖ ను కోరారు. సమావేశంలో డిఇఒ ఎన్.ప్రేమ్ కుమార్, జిల్లా కో-ఆర్డినేటర్ కె.రమణ, చీఫ్ సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

సీతంపేట : సీతంపేట, వీరఘట్టం ఐసిడిఎస్ ప్రాజెక్టుల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు గురువారం ఐటిడిఎలోని ప్రాజెక్ట్ ఆఫీసర్ కల్పనా కుమారి ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. 11 పోస్టులకు గానూ 44 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకొన్నారు. వీరఘట్టం ప్రాజెక్టులో 3 హెల్పర్ పోస్టులకు గానూ 16 దరఖాస్తులు వచ్చాయి. సీతంపేటలో 2 అంగన్వాడీ వర్కర్ పోస్టులకు 10 దరఖాస్తులు, 4 హెల్పర్ పోస్టులకు 18 దరఖాస్తులు వచ్చాయి. 2 మినీ అంగన్వాడీ వర్కర్ పోస్టులకు పూర్తిగా దరఖాస్తులు రాలేదని పీవో తెలిపారు. హాజరైన 44 మంది అభ్యర్థులకు ఐటిడిఎ పిఒ ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో సబ్ కలక్టర్ నూరుల్ కమర్, డిఎంహెచ్ఒ బి.జగన్నాధరావు, ఐసిడిఎస్ పీడీ విజయగౌరి, సీడీపీవోలు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు 17 మేకలు మృతి

శృంగవరపుకోట : మండలంలోని బొడ్డవర పంచాయతీ మరుపల్లి గ్రామంలో గురువారం మధ్యాహ్నం మేకల మందపై పిడుగు పడింది. దీంతో చెట్టు కింద ఉన్న 17 మేకలు మృత్యువాత పడ్డాయి. గ్రామానికి చెందిన వ్యాపార సత్తిబాబు వాతావరణం చల్లబడంతో చెట్టు కింద మేకలను ఉంచాడు. ఈ సమయంలో మేకలపై ఒక్కసారిగా పిడుగు పడంతో అన్నీ చనిపోయాయి. ఇది చూసిన సత్తిబాబుతో పాటు అతని కుటుంబ సభ్యులు తీవ్రంగా విలపించారు. రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లిందని, తమ జీవనోపాధి పోయిందని బాధితులు బోరున విలపించారు. బొడ్డవర సర్పంచ్ దేవాపూర్ మేన, వైసిపి నాయకులు బుద్ధరాజు మురళిరాజు గ్రామానికి చేరుకుని రైతు కుటుంబాన్ని పరామర్శించారు ప్రభుత్వపరంగా సాయం అందించేలా చూస్తామని హామీనిచ్చారు.



మృతిచెందిన మేకలు

అండర్-19 కబడ్డీ జట్ల ఎంపిక

విజయనగరం టౌన్ : ఈనెల 20, 21 తేదీల్లో స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణంలో జరగనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు అండర్ 19 జిల్లా బాల బాలికలు జట్లు ఎంపిక గురువారం పూర్తయ్యింది. ఈ సందర్భంగా జిల్లా కబ్బడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ఈశ్వర్ కౌశిక్, కార్యదర్శి కాళ్ళ సూరిబాబు, డిఒఇఒ సురేష్ బాబు, అండర్ 19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి సత్తా చాటాలని కోరారు. ఎంపిక ప్రక్రియలో కబ్బడ్డీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పి శ్రీనివాసరావు, బొమ్మన రామారావు, స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎల్ వి రమణ తదితరులు పాల్గొన్నారు.

రెయిన్‌బోతో సెంచూరియన్ ఒప్పందం

నెల్లిమర్ల : రెయిన్‌బోతో సెంచూరియన్ విశ్వవిద్యాలయం అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. గురువారం రెయిన్‌బో మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నాదేళ్ల గిరితో వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు పరస్పర అవగాహనా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పిఎస్‌వి రమణారావు, డీన్ ప్రొఫెసర్ ఎం.లక్ష్మీనరసింహచార్యులు, విభాగాధిపతులు నూకరాజు, రషీద్, తదితరులు పాల్గొన్నారు.

పగలంతా భానుడు.. సాయంత్రం వరుణుడు

- ఈదురు గాలుల బీభత్సం
- కుండపోత వర్షంతో ఉపశమనం
- పలుచోట్ల వడగళ్ల వాన

ప్రజాశక్తి - కురుపాం

కురుపాంతో పాటు పరిసర ప్రాంతాల్లో గురువారం పగలంతా భానుడు భగభగ మండిపోగా, సాయంత్రానికి వరుణుడు తన ప్రతాపాన్ని చూపాడు. నాలుగైదు రోజుల క్రితం నుంచి ఎండదాటికి ఉష్ణోగ్రతలు 46, 47 డిగ్రీలకు తగ్గకుండా ఉండడంతో జనం బెంబేలెత్తిపోతుంటే గురువారం ఉదయం నుంచి భానుడు భగభగ మండిపోవడంతో మధ్యాహ్న సమయానికి 46 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటికి వచ్చేందుకు సాహసించడం లేదు. ఏదైనా పని ఉంటే గొడుగు వేసుకొని బయటకొచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒకే రకంగా ఎండకాయడంతో పాటు ఉక్కబోత తోడు కావడంతో ప్రజలు, ముఖ్యంగా వృద్ధులు. చిన్నపిల్లలు విలవిలలాడిపోయారు. కొంత మంది ప్రకృతి ఒడిలో పచ్చని చెట్లు కింద సేద తీరగా, మరికొంత మంది ప్రజలు ఏసీలు, కూలర్లు వేసుకొని ఇళ్లకే పరిమితమయ్యారు.



కురుపాంలో కురుస్తున్న వడగళ్ల వాన

కుండపోత వర్షం

ఉదయం నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు భానుడు తన ప్రతాపాన్ని చూపగా, సాయంత్రం ఐదు గంటల తర్వాత వాతావరణం చల్లబడింది. ఆకాశం మేఘావృతమై ఈదురుగాలులు, ఉరుములతో వడగల్లుతో సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు కొండపోతగా ఏకధాటిగా వర్షం కురిసింది. దీంతో కురుపాం పరిసర ప్రాంతాలు చల్లటి వాతావరణం నెలకొనడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అయితే అగ్నికర్తెలు ఉండడంతో రానున్న రోజుల్లో అధిక ఉష్ణోగ్రతలతో పాటు వడగాలులు వీసే ప్రమాదం పొంచి ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పార్వతీపురంలో ఈదురుగాలులు, పిడుగులు బీభత్సం

పార్వతీపురం రూరల్/కలెక్టరేట్ : పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో గురువారం ఈదురు గాలులు పిడుగులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. పార్వతీపురం రైల్వే స్టేషన్‌లో పిడుగుపాటుకు చెట్టు కాలిపోయింది. అలాగే మెయిన్ రోడ్‌లోని భవనాలపై ఏర్పాటు చేసిన హోర్డింగ్స్ ఈదురు గాలుల నేలకు ఒరిగాయి. అయితే ఆ సమయంలో జనసంచారం లేకపోవడంతో ప్రమాదం తప్పింది. హోటల్ శ్రీకాంత్ వెనుక ఉన్న చెరువుగట్టుపై చెట్టు కూలిపోవడంతో విద్యుత్ తీగెలు తెగిపోయి విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగింది. 12వ వార్డు ఇందిరా కాలనీలో కూడా చెట్లు కూలిపోవడంతో జనజీవనానికి అంతరాయం ఏర్పడింది. జిల్లా కార్యాలయాల ప్రాంగణంలో చెట్లు కొమ్మలు విరిగి విద్యుత్ తీగల పైన, పార్కింగ్ ప్రదేశంలో ఉంచిన కార్లపై పడ్డాయి.అప్పటివరకు విపరీతమైన ఉష్ణోగ్రతలతో జనం ఇబ్బంది పడ్డప్పటికీ సాయంత్రం నాలుగు గంటల దాటిన తర్వాత ఒక్కసారి వాతావరణం మారింది. వర్షంతో వాతావరణం చల్లబడినప్పటికీ, పెనుగాలులు, పిడుగులు సృష్టించిన బీభత్సం వల్ల విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



పార్వతీపురం : ఈదురుగాలులకు వాహనాలపై కూలిన చెట్లు



విద్యార్థులకు క్రీడా పరికరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి -పార్వతీపురంటౌన్

ప్రతి విద్యార్థి చిన్నతనం నుండే నచ్చిన క్రీడను ఎంపిక చేసుకొని అందులో రానించాలని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు సూచించారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగే వేసవి క్రీడా శిక్షణ తరగతులు స్థానిక అర్‌సిఎం స్కూల్ ఆవరణంలో గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడారంగంలో ప్రతిభ కనబర్చడం ద్వారా భవిష్యత్‌లో ఉద్యోగాలు పొందేందుకు క్రీడాకారులకు ప్రత్యేక రిజర్వేషన్ ఉంటుందన్నారు. ప్రతి విద్యార్థి క్రీడా రంగంలో రాణించి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకొని రావాలని ఉద్బోధించారు. వేసవి క్రీడా శిక్షణలో భాగంగా జిల్లాలో 50 కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేశారని, ఈ క్యాంప్‌లను జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో నిర్వహిస్తున్నారని, దీనికి వ్యాయామ ఉపాధ్యాయులు సీనియర్ క్రీడాకారులు, ప్రజాప్రతి నిధులు, స్థానిక ప్రజా సంఘాల సహాయ సహకారాలతో నిర్వహిస్తున్నామని తెలిపారు. దీన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ శిక్షణా తరగతులు ఈనెల 31 వరకు జరగనున్నాయని శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు అందజేస్తారని అన్నారు. కార్యక్రమం అనంతరం క్రీడాకారులకు పరికరాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బి.గౌరీశ్వరి, డిఇఒ ఎన్.ప్రేమ్ కుమార్. పంచాయతీరాజ్ ఎస్ఇ డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజీ, చీఫ్ కోచ్ ఎస్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చెక్కవలసలో ఏనుగుల సంచారం

ప్రజాశక్తి - కురుపాం

నియోజకవర్గ కేంద్రమైన కురుపాం సమీపంలో గల చెక్కవలస రహదారి పై గురువారం ఉదయం నుంచి ఏనుగుల గుంపు సంచరిస్తుంది. దీంతో రహదారి మీదుగా పక్క గ్రామాలకు అవసరాల నిమిత్తం వెళ్లాల్సిన గ్రామస్తులు, పొలాలకు వెళ్లే రైతులు భయాందోళన చెందుతున్నారు. ఏ సమయంలో ఏం చేస్తాయో తెలియక స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏనుగుల గుంపు తమ గ్రామ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తూ పంటలను నాశనం చేస్తున్నాయన్నారు. తామంతా రైతు కుటుంబాలమేనని వ్యవసాయమే తమకు జీవన ఆధారమని ఎప్పుడూ పొలాల్లో ఉంటామని అన్నారు. అటువంటిది పొలాలకు వెళ్లాలంటే భయమేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎప్పుడు ఎటువైపు నుంచి ఏనుగులు వచ్చి ఏం చేస్తాయోనని ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకోవాల్సి పరిస్థితి వస్తుందని అన్నారు. కావున అటవీ శాఖ అధికారులు స్పందించి తక్షణమే ఏనుగుల బారి నుంచి తమ ప్రాణాలను, పంటలను కాపాడి జనజీవనానికి దూరంగా ఉన్న అటవీ ప్రాంతానికి తరలించాలని కోరుతున్నామని తెలిపారు..



చెక్కవలస రోడ్డుపై సంచరిస్తున్న ఏనుగులు



ఆందోళన చేస్తున్న శిఖపరువు గ్రామ గిరిజనులు

అక్రమ మైనింగ్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

అక్రమ మైనింగ్ రద్దు చేయాలని, గిరిజన భూములకు రక్షణ కల్పించాలని, గిరిజనులను వేధింపులకు గురి చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండలంలోని పట్టుచెన్నారు పంచాయతీ శిఖపరువు వద్ద గిరిజన సంఘం, సిపిఎం ఆధ్వర్యంలో గురువారం నిరసన చేపట్టారు. ఈ నిరసనలో స్థానిక గిరిజనులు, గిరిజన సంఘం నాయకులు కోనేటి లక్ష్మణ, శంభు, సిహెచ్ డిప్పయమ్మ, కాంగు, మర్రి శ్రీనివాసరావు, కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ షెడ్యూల్ గ్రామాలను లెక్కచేయకుండా నిబంధనలను ఉల్లంఘించి అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారన్నారు. ఇదే విషయంపై 2012లో గిరిజన గ్రామాల్లో రెండుసార్లు పబ్లిక్ హియిరింగ్ జరిగ్గా గిరిజనులంతా ఏకగ్రీవంగా అక్రమ మైనింగ్ వ్యతిరేకించారని, గ్రామసభ ఆమోదం లేకుండా పీసా చట్టాన్ని ఉల్లంఘిస్తూ ఏ విధంగా మైనింగ్ చేస్తారని అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా అధికారులు తిరిగి వెళ్లిపోయారని అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో మళ్లీ మైనింగ్ కార్యక్రమాలను చేపట్టడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. దీనిపై కలెక్టర్ స్పందించి ఇటువంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై క్రిమినల్ కేసులు పెట్టి గిరిజన భూములకు, గిరిజనులకు రక్షణ కల్పించాలని కోరారు. గిరిజనులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి ప్రజలంతా సంఘీభావం తెలపాలని కోరారు. కార్యక్రమానికి సర్పంచ్ చోడిపల్లి బీసూ ప్రతినిధి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు కోతలు ఆపాలి : సిపిఎం

22న విద్యుత్తు కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి కలెక్టరేట్

జిల్లాలో విద్యుత్ కోతలు వెంటనే ఆపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు డిమాండ్ చేశారు. విద్యుత్ కోతలకు నిరసనగా ఈనెల 22న స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన ధర్నా చేపడ తామని తెలిపారు. గురువారం స్థానిక సుందరయ్య భవన్లో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఎండల తీవ్రతతో ఉక్కపోత, వడగల్పులతో జిల్లాలో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి తోడు విద్యుత్ కోతలతో అల్లాడిపోతున్నారన్నారు. పార్వతీపురం జిల్లా కేంద్రంలో టౌన్, బెలగాం ప్రాంతాల్లో రోజు రాత్రులు భోజనాలు, నిద్రించే సమయాల్లో విద్యుత్ కోతలు చేస్తున్నారని, వెంటనే ఈ విద్యుత్‌కోతలను అరికట్టాలని కోరారు. పార్వతీపురంలో 11 ఏళ్ల తర్వాత అమ్మవారి పండుగలు జరుగుతున్న సందర్భంగా పూర్తిస్థాయిలో విద్యుత్తు, మంచినీరు సౌకర్యం సక్రమంగా అందించాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. వేసవిలో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుందని, కావున రాష్ట్ర ప్రభుత్వం ముందుచూపుతో వ్యవహరించకపోవడం వల్ల విద్యుత్ కోతలు జరుగుతున్నాయని, దీనికి పూర్తిగా ప్రభుత్వమే బాధ్యతవహించాలని అన్నారు. వెంటనే అదనపు విద్యుత్తును సమకూర్చి కోతలు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. నాలుగు రోజుల్లో విద్యుత్ కోతలు అరికట్టాలని, లేకుంటే స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. విలేకరుల సమావేశంలో సిపిఎం నాయకులు గొర్లి వెంకటరమణ, వి.ఇందిరా, కె.రాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు



కూలీలతో మాట్లాడుతున్న ఎంపిడిఒ ప్రసాద్

ఉపాధి పనుల పరిశీలన

సీతానగరం : మండలంలోని చిన్నారి పేట గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఎంపిడిఒ ఎంఎస్ఎల్ఎన్ ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల వద్ద మంచినీరు, టెంట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సమయానికి వచ్చి పనులు చేసుకుని వడ దెబ్బకు గురికాకుండా చూసుకోవాలన్నారు. కొలతలు ప్రకారం పనులు చేస్తే కూలి కిట్టుబాటు అవుతుంన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యాధికారి జి. ప్రదీప్‌కుమార్

సర్వేకు సహకరించాలి

వీరఘట్టం : ఎన్‌డిజి సర్వే చేపట్టేందుకు సహకరించాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జి ప్రదీప్ కుమార్ సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎఎన్ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులతో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఆరు సంవత్సరాలు నుండి 19 సంవత్సరాల లోపు పిల్లల యొక్క వివరాలు, గర్భిణులు, బాలింతల వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. అందరి సహకారంతో సర్వే పూర్తికి కృషి చేయాలని ఆదేశించారు. ఎంపిడిఒ వై. వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బిటవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మానస, ఎన్ కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



నిత్యవసరాలను అందిస్తున్న అనిల్ కుటుంబ సభ్యులు

రాజేష్ కుటుంబానికి వితరణ

వీరఘట్టం: మండలంలోని ఎం రాజపురం గ్రామ దళిత వీధికి చెందిన డి రాజేష్ మృతి చెందిన విషయం తెలుసుకొని విక్రం పురం గ్రామానికి చెందిన మాచర్ల అనిల్ కుటుంబ సభ్యులు ఆ గ్రామానికి గురువారం చేరుకొని ఇంటికి సరిపడా వస్తువులను అందజేశారు. రాజేష్ తల్లిదండ్రులు సింహాచలం, కుమారిలను ఓదార్చారు.



ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తున్న ఫారెస్టు అధికారులు

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

కురుపాం : మండలంలో పెదగొత్తిలి పంచాయతీ పరిధిలో గల సంతోషపురం గ్రామంలో రెవెన్యూ, అటవీ శాఖ ఆధ్వర్యంలో గురువారం ప్లాస్టిక్ నిషేధంపై గిరిజన ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ టి. లోకనాథం ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్ సంచులు, గ్లాసులు, బాటిల్స్ వాడడం వల్ల అవి భూమిలో కలవకపోవడంతో ప్రజలకు చాలా వ్యాధులు పొంచి ఉండే ప్రమాదం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలందరూ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ అధికారి బి. అవతారం, మండల సర్వేయర్ కె. రవికుమార్, సర్వేయర్లు ఎ. కార్తీక్, జి. మన్మధరావు, విఆర్ఒ జయకుమార్, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణకు పాటుపడతాం

పార్వతీపురం టౌన్: సామాన్యుల హక్కుల రక్షణ, భద్రత, కనీస ప్రయోజనాలను కాపాడ్డానికి జాతీయ మానవ హక్కుల కమిటీ (నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ - ఎన్‌హెచ్ఆర్‌సి) కృషి చేస్తుందని జిల్లా కమిటీ కార్యవర్గం తెలిపింది. జిల్లా నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర అధ్యక్షులు కదిరి రాము ప్రకటించారు. జిల్లా అధ్యక్షులుగా వి.దాలినాయుడును, కార్యదర్శిగా బోనెల పరశురాం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా గొర్లి వెంకటరమణరావును నియమించినట్లు తెలిపారు. ఈ మేరకు వారు విలేకరులతో మాట్లాడుతూ తమకు అప్పగించిన బాధ్యతలను శతశాతం నెరవేర్చేందుకు కృషి చేస్తామన్నారు. మానవ హక్కుల పరిరక్షణ, హక్కుల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడం తదితర కార్యక్రమాలు చేపడతామన్నారు. జిల్లాలో ఎక్కడైనా మానవ హక్కులకు భంగం కలిగితే వారి చెంత నిలబడి వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తామన్నారు. తమకు రాష్ట్ర జిల్లా ప్రతినిధులుగా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షులు కదిరి రాముకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎంఇఒలుగా నియమించడం హర్షణీయం


పార్వతీపురం టౌన్ : జెడ్పీ యాజమాన్యం టీచర్లను ఎంఇఒ-2 పోస్టుల్లో నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం హర్షణీయమని ఎపి ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం కొత్తగా 679 ఎంఇఒ పోస్టులను మంజూరు చేసిందని, ఈ పోస్టులను జెడ్పీ హెచ్ఎంలతో భర్తీ చేయడం వల్ల అదే సంఖ్యలో స్కూల్ అసిస్టెంట్ క్యాడర్ టీచర్లకు హైస్కూల్ హెచ్ఎంలుగా ఉద్యోగోన్నతులు లభిస్తాయన్నారు. ప్రస్తుతం విద్యా శాఖలో ఖాళీగా ఉన్న ఎంఇఒ పోస్టులను ప్రభుత్వ టీచర్లకు ఇచ్చినట్లయితే ఇరు మేనేజ్మెంట్ టీచర్లకు సమన్యాయం జరుగుతుందన్నారు. లేకుంటే ప్రభుత్వ టీచర్లకు నష్టం జరుగుతుందని తెలిపారు. ఈ విషయంలో తగు రీతిలో చర్యలు తీసుకోవాలని విద్యాశాఖా మంత్రికి, విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ విజ్ఞప్తి చేశారు

నదే దిక్కు..

- గుక్కెడు నీటి కోసం నాగావళి వద్దకు పరుగులు
- చుక్క నీరివ్వని కుళాయి పాయింట్లు
- ఉత్సవ విగ్రహాల్లా రక్షిత మంచినీటి పథకాలు
- చుట్టూ నదులున్నా పథకాలకు అందని నీరు

ప్రజాశక్తి - వీరఘట్టం

అన్నీ ఉన్న అల్లుడు నోట్లో శని అన్న చందంగా మండల చుట్టూ నదులే ఉన్నా తాగడానికి గుక్కెడు మంచినీరు దొరక్క మండల ప్రజలు అల్లాడిపోతున్నారు. ఎక్కడికక్కడ రక్షిత మంచినీటి పథకాలున్నా అవి ఉపయోగంలో లేకపోవడంతో గొంతును తడుపుకు నేందుకు ఆరాటపడుతున్నారు.



కిమ్మి గ్రామంలో వృధాగా పడి ఉన్న రక్షిత మంచినీటి పథకం

మండలంలోని 67 గ్రామాల్లో 17,162 కుటుంబాలు దాదాపుగా 65,616 జనాభా నివాసం ఉంటున్నారు. 392 తాగునీటి బోరు బావులు, 23 రక్షిత మంచినీటి పథకాలు, 5 సోలార్ మంచినీళ్ల ట్యాంకులు ఉన్నట్లు గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు గణాంకాలు చెబుతున్నాయి. మండలంలోని అన్ని గ్రామీణ ప్రాంతాల ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు వీలుగా 2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో 13వ ఆర్థిక సంఘం నిధులు రూ. 15కోట్లతో వండవ కొండపైన ఉపరితల రక్షిత మంచినీటి పథకం ఏర్పాటు చేసేందుకు అప్పటి ఎమ్మెల్యే నిమ్మక సుగ్రీవులు శంకుస్థాపన చేశారు. ఎం.వి.పురం గ్రామ సమీపంలోనే నాగావళి నది వద్ద గల ఇన్ఫిల్ట్రేషన్ ట్యాంకులు నిర్మించి అక్కడి నుండి నేరుగా వండవ కొండపై ఉన్న ఉపరితల పథకానికి నీరు ఎక్కించి అక్కడి నుండి గ్రామాలకు తాగునీటి సరఫరా చేస్తున్నారు.

25 గ్రామాలకే పరిమితం

వండువ ఉపరితల పథకం నుండి రాజపురం, కత్తులకవిటి, హుస్సేనపురం రేగులపాడు, కొంచ, దువ్వనపాడు, తూడి బొడ్లపాడు, పాపంపేట, తదితర 25 గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతుంది. కొంచ, దువ్వనపాడు గ్రామాలకు పథకం ప్రారంభమై ముచ్చటగా 3 రోజులు కుళాయి ద్వారా తాగునీటి సరఫరా అయ్యిందని అప్పటి నుండి ఈ రెండు గ్రామాలకు తాగునీరు సరఫరా లేకపోవడంతో ప్రజలు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కాలంలో కొంచ గ్రామంలో మండల పరిషత్ నిధుల నుండి సుమారు రూ. 70వేలతో బోరుబావి ఏర్పాటు చేసినప్పటికీ బోరు బావి ద్వారా వచ్చేనీరు బురదగా ఉంటుందని కొంచ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన కులాయి పాయింట్లు ఉత్సవ విగ్రహాల్లా దర్శనమిస్తున్నాయి.

ఇదీ గ్రామాల్లో పరిస్థితి

కిమ్మి గ్రామంలో 15 ఏళ్ల కిందట సుమారు రూ. 16 లక్షలతో రక్షిత మంచినీటి పథకంతో పాటు పైపులైన్ ఏర్పాటు చేశారు. పథకం మూడు రోజులు ముచ్చటగా పని చేసి మూలకు చేరింది. దీంతో గ్రామస్తులు సమీపంలో ఉన్న నాగావళి నది వద్దకు తాగు నీటి కోసం పరుగులు తీస్తున్నారు. నడుకూరు గ్రామంలోని సుమారు రూ.16 లక్షలతో 15 ఏళ్ల కిందట రక్షిత మంచినీటి పథకం ఏర్పాటు చేశారు. గ్రామంలోని అన్ని వీధులకు కుళాయి పాయింట్లతో పాటు అప్పట్లో నడుకూరు గ్రామానికి అనుసంధానంగా కంబర వలస గ్రామం ఉండేది. నడుకూరు రక్షిత మంచినీటి పథకం నుండి కంబర వలస గ్రామానికి తాగునీరు అందించేందుకు అప్పట్లో పైపులైన్ ఏర్పాటు తోపాటు కుళాయి పాయింట్లు కూడా ఏర్పాటు చేశారు. అది కూడా మూడు రోజులు ముచ్చటగా పని చేసి మూలకు చేరడంతో నిరుపయోగంగా పడి ఉన్నాయి. కంబర వలస జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో నైట్ వాచ్మెన్ పోస్ట్‌కు సంబంధించి విచారణ జరిపేందుకు ఈనెల ఆరో తేదీన సీతంపేట ఐటిడిఎ పిఒ కల్పనా కుమారి గ్రామాన్ని సందర్శించినప్పుడు గ్రామానికి చెందిన దళితులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పిఒ దృష్టికి తీసుకువచ్చారు. తమ వీధిలో ఒక బోరు, బావి ఉందని, బోరు ద్వారా వచ్చి నీరు తాగేందుకు పనికి రావడంలేదని పంట పొలాల్లో ఉన్న బావి వద్దకు వెళ్లి నీరు తోడుకొని తీసుకువచ్చి దాహార్తిని తీర్చుకోవలసిన పరిస్థితి ఏర్పడుతుందని దళితులు పిఒ వద్ద తమ గోడును వెలబుచ్చుకున్నారు. ఏదేమైనా చుట్టూ నదులు ఉన్నప్పటికీ నదులు చుట్టూ గ్రామాలు ఉన్నప్పటికీ, గ్రామాలు చుట్టు పథకాలు ఉన్నప్పటికీ ప్రజలకు గుక్కెడు నీరు అందించేందుకు ఇటు పాలకులు అటు అధికారులు తీవ్రంగా విఫలమయ్యారని ప్రజలు ఆరోపిస్తున్నారు.



పిఆర్‌పురంలో పనిచేయని కుళాయిలు

పేరుకే జలజీవన్ మిషన్

మండలంలోని చిదిమీ, సిఎస్ఆర్‌పేట, యు వెంకంపేట, పాపంపేట, డిపి వలస, చేబియ్యం వలస, వండవ, నీలనగరం, తెట్టంగి, హుస్సేన్‌పురం, కత్తుల కవిటి, తలవరం, శృంగరాయపురం గ్రామాల్లో రూ.కోటి 72 లక్షలతో జలజీవన్ మిషన్ ద్వారా మొదటి విడతలో ఇంటింటికి కుళాయిల ద్వారా తాగునీరు ఇచ్చేందుకు గ్రామీణ నీటి సరఫర



నది నుండి నీటిని తీసుకువస్తున్న మహిళలు

విభాగం కింద పనులు చేపట్టారు. ఏళ్లు గడుస్తున్న చుక్కనీరు రాకపోవడంతో పేరుకే జలజీవన్ మిషన్ అని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు.

గొంతు తడవాలంటే నది వద్దకు పరుగెత్తాల్సిందే

మండలంలోని గడగమ్మ, చిట్టి పూడివలస, బూరుగా, బిటవాడ తదితర గ్రామ ప్రజలు గొంతును తడుపుకునేందుకు నాగావళి నది వద్దకు పరుగులు తీసి చలమల ద్వారా నీరు తోడుకొని తీసుకొచ్చి దాహార్తిని తీర్చుకోవలసిన పరిస్థితి ఏర్పడుతుందని మహిళ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గడగమ్మ గ్రామంలో బోరు బావులు ఉన్నప్పటికీ తాగేందుకు పనికిరావు, బూరుగ గ్రామంలో తాగునీటి కోసం గ్రామస్తులు సమీపంలో ఉన్న కూరగాయల పంటల వద్ద ఏర్పాటు చేసిన మోటార్ల వద్దకు వెళ్లి నీరు తీసుకొచ్చి దాహార్తిని తీర్చుకుంటున్నారు. ఇదే విషయమై గతేడాది అక్టోబర్ 21న పాలకొండ సబ్ కలెక్టర్ నూరల్ కమర్ గ్రామంలో పర్యటించి నప్పుడు తాగునీటి కోసం ఇబ్బం దులు పడుతున్నామని మహిళలు దరఖాస్తు చేశారు. కానీ ఇప్పటి వరకూ ఎటువంటి చర్యలూ చేపట్టడం లేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు.

రెజ్లర్లకు మద్దతుగా ఆందోళనలు

బిజెపి ఎమ్‌పిని అరెస్టు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి- బలిజిపేట

బిజెపి ఎంపి బ్రిడ్జ్ భూషణ్‌ను తక్షణం అరెస్టు చేసి అన్ని పదవుల నుండి బర్తరఫ్ చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని పలగర గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన రెజ్లర్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడైన బ్రిడ్జ్ భూషణ్‌ను అరెస్టు చేయాలని గత 25 రోజులుగా లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ఆందోళన నిర్వహిస్తున్న మహిళా రెజ్లర్లను పిలిచి మాట్లాడి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 39 కేసుల్లో నిందితుడిగా ఉన్న బిజెపి ఎంపి బ్రిడ్జిభూషణ్ సింగ్‌ను తక్షణం అన్ని అధికార రాజకీయ పదవుల నుండి తొలగించి, సుప్రీంకోర్టు లేదా హై కోర్టు న్యాయమూర్తితో సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న రెజ్లర్ల శిబిరం వద్ద విద్యుత్తు పంపిణీ, మంచినీటి సరఫరాను పునరుద్ధరించాలని, ఆందోళనకారుల పట్ల అసభ్యంగా వ్యవహరించిన ఢిల్లీ పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ప్రజాసంఘాలుగా పెద్ద ఎత్తున ఉద్యమించుతాయని హెచ్చరించారు. మెడల్స్ సాధించినప్పుడు ఇంటికి పిలిచి మరి ఆతిథ్యం ఇచ్చిన ప్రధానమంత్రి నేడు రెజ్లర్ల సమస్య పట్ల మౌనం వహించడానికి కారణమేంటని ప్రశ్నించారు. తమ రాజకీయ ప్రయోజనాల కోసం క్రిమినల్ రాజకీయ నాయకుడైన బ్రిడ్జ్ భూషణ్ అరాచకాలపట్ల బిజెపి నాయకత్వం మౌనంగా ఉండడం మంచిది కాదన్నారు. దేశ ప్రతిష్టను ముందుకు తీసుకెళుతున్న రెజ్లర్లు పై ఈ విధంగా ప్రవర్తించడం మంచిది కాదని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు సుధ, చిన్నమడు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



బలిజిపేట: అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

పార్వతీపురం రూరల్ : ఢిల్లీలో గత 20 రోజులుగా మల్లయోధులు (రెజ్లర్లు) చేపడుతున్న పోరాటానికి మద్దతుగా ప్రజా సంఘాల జాతీయ కమిటీల పిలుపులో భాగంగా గురువారం సిఐటియు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కోటవానివలస రోడ్డు సమీపంలో ఉపాధి కూలీలతో రాస్తారోకో చేశారు. అనంతరం సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి వి. ఇందిరా మాట్లాడుతూ క్రీడాకారుల పట్ల బిజెపి నరేంద్రమోడీ ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తుందని, క్రీడాకారులు దేశానికి పతకాలు తీసుకొస్తుంటే, బిజెపి ఎంపిలు, మంత్రులు మాత్రం వారిపట్ల నీచంగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. మహిళా రెజ్లర్లను బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్‌ను, హర్యానా మంత్రి సందీప్ సింగ్ మానసికంగా హింసించి, వారి ఉన్నత స్థాయిలను కించపరిచేటట్లు వ్యవహరించారాని, వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. గత 20 రోజులుగా ఢిల్లీ నడి ఒడ్డున్న ఆందోళన చేపడుతున్నప్పటికి బిజెపి మోడీ ప్రభుత్వం స్పందించకపోవడం దౌర్భగ్యమన్నారు. దీనిని బట్టి మహిళల పట్ల బిజెపి ప్రభుత్వం తీరు స్పష్టంగా కనిపిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి. రాజశేఖర్, సింహాచలం, శ్రీను, స్వామినాయుడు, అప్పయమ్మ పాల్గొన్నారు.



పార్వతీపురం: రోడ్డుపై నిరసన తెలుపుతున్న నాయకులు



కార్మికులతో చర్చిస్తున్న ప్రతినిధులు

కార్మికులతో చర్చలు విఫలం

సాలూరు: పట్టణంలోని చింతపండు పిక్కతీత కార్మికులతో చింతపండు గోడౌన్ యజమానుల సంఘం ప్రతినిధులు జరిపిన చర్చలు విఫలమయ్యాయి. 40రోజులుగా చేపడుతున్న సమ్మె కొనసాగించాలని నిర్ణయించినట్లు కార్మికుల సంఘం గౌరవాధ్యక్షులు ఎన్వై నాయుడు చెప్పారు. పట్టణంలోని వాసవీ కల్యాణమండపంలో పిక్కతీత కార్మికుల సంఘం ప్రతినిధులు శ్యామల, నారాయణమ్మ, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు, యజమానుల సంఘం ప్రతినిధులు అప్పలనాయుడు, రమేష్‌తో అసిస్టెంట్ లేబర్ కమిషనర్ రామకృష్ణ, అసిస్టెంట్ లేబర్ అధికారి సుందరరావు సమక్షంలో గురువారం చర్చలు జరిపారు. పట్టణంలో పని చేస్తున్న 350మంది పిక్కతీత మహిళా కార్మికులు కిలో చింతపండు పిక్కతీతకు రూ.24 చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. దీనికి గోడౌన్ యజమానుల సంఘం ప్రతినిధులు అంగీకరించకపోవడంతో చర్చలు విఫలమయ్యాయి. దీంతో కార్మికులు సమ్మె కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నట్లు ఎన్వైనాయుడు చెప్పారు.

పాఠశాలలు ప్రారంభం నాటికి వసతులు

ప్రజాశక్తి- సీతంపేట

వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు ప్రారంభం అయ్యే నాటికి విద్యార్థులకు అన్ని రకాల వసతులూ కల్పించాలని ఐటిడిఎ పిఒ కల్పన కుమారి అన్నారు. గురువారం ఐటిడిఎ పరిధిలోగల విద్యాశాఖ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమైన తర్వాత అధికారులంతా క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. విద్యార్థులకు అత్యుత్తమ బోధన అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వసతి గృహాల్లో మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. నాడు నేడు పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని హెచ్ఎంలకు సూచించారు. విద్యార్థులకు రావాల్సిన జగనన్న వసతి దీవెన, విద్యా దీవెన, ప్రభుత్వం నుంచి వచ్చే కిట్లు వంటి పథకాలు విద్యార్థులకు సక్రమంగా అందేలా చూసుకోవాలన్నారు. విద్యార్థులకు పుస్తకాల పంపిణీలో అలసత్యం ఉండకూడదన్నారు. ఈ సమావేశంలో డిడిలు బి. నగేష్, బి. సూర్యనారాయణ, ఒఎస్‌డి ఎడ్యుకేషన్, ఎం. యుగంధర్, ఈఈ జి. మురళి, ఎటిడబ్ల్యుఒలు, మంగవేణి, శ్రీనువాసరావు, హెచ్ఎంలు, ప్రిన్సిపాల్స్, హెచ్‌డబ్ల్యుఒలు తదితరులు పాల్గొన్నారు.



ప్రధానోపాధ్యాయులతో మాట్లాడుతున్న పిఒ

మొక్కజొన్నలో తేమశాతం పరిశీలన

ప్రజాశక్తి- పాచిపెంట

ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోళ్లకు నిర్ణయించిందని క్వింటా ధర రూ.1962లు చెల్లిస్తోందని ఎఒ కె.తిరుపతిరావు అన్నారు. మార్క్‌ఫెడ్ ప్రతినిధి సూర్యనారాయణతో కలిసి పాంచాలి, గురువు నాయుడు పేట గ్రామాలలో మొక్కజొన్నలో తేమ శాతాన్ని పరీక్షించారు. తేమ 14 శాతాన్ని మించకూడదని అపరిపక్వ గింజలు నాలుగు శాతం మించ కూడదని రంగు మారినవి నాలుగున్నర శాతం మించ కూడదని, పురుగు పట్టినవి, వ్యర్థ పదార్థాలు ఒక్క శాతం మించకూడదని, దెబ్బతిన్న గింజలు ఒకటిన్నర శాతం, ఇతర ధాన్యపు గింజలు మూడు శాతానికి మించకూడదని చెప్పారు రైతులు మొక్కజొన్న గింజలను బాగా ఎండలో ఆరబోసి గాలికి పోసినట్లయితే నిబంధనల ప్రకారం క్వింటా ధర 1962 రూపాయలకు కొనుగోలుకు మార్క్‌ఫెడ్ సిద్ధంగా ఉందని రైతులు దళారీలకు ఇవ్వకుండా మార్క్‌ఫెడ్‌కు అందించాలని కోరారు. అనంతరం రైతు భరోసా కేంద్రాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. పిఎం కిసాన్ ఇకెవైసి ఈనెల 20వ తారీకు లోగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విఎఎలు బాలకృష్ణ, శ్రీను పాల్గొన్నారు



యంత్రంతో జొన్నపిక్కలను పరిశీలిస్తున్న ఎఒ

కొరత లేకుండా చూడండి: డిప్యూటీ సిఎం

సాలూరు: రానున్న ఖరీఫ్ సీజన్ దృష్టిలో ఉంచుకొని రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని డిప్యూటీ సిఎం రాజన్నదొర ఆదేశించారు. గురువారం ఆయన తన నివాసంలో కలిసిన ఎడి మధుసూదనరావుతో మాట్లాడారు. వరి విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూడాలని కోరారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు జరిగిన నష్టానికి పరిహారం మంజూరయ్యేలా చూడాలన్నారు.

ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి - కొమరాడ

వైద్యులు, సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు అన్నారు. మండలంలోని కూనేరు రామభద్రపురం, కొమరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఒపి రికార్డులను పరిశీలించి నమోదు చేసిన రోగాలను, అందుకు ఇచ్చే చికిత్స వివరాలపై సిబ్బందిని ఆరా తీశారు. జ్వర లక్షణాలతో ఎవరు పిహెచ్‌సికి వచ్చినా నిర్ధారణ పరీక్షలు ఖచ్చితంగా జరిపి ఆ గ్రామ వైద్య సిబ్బందికి తెలియజేసి పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన వ్యాక్సిన్ నిల్వలు, భద్రపర్చే ఐఎల్ఆర్‌లను తనిఖీ చేసి ఉష్ణోగ్రతను పరిశీలించారు. ఇన్వర్టర్ బ్యాటరీ పనితీరు ఎప్పటికప్పుడు పరిశీలించాలని, నిబంధనలు ప్రకారం వ్యాక్సిన్ అమరిక ఉండాలని ఫార్మసిస్టులను ఆదేశించారు. పిహెచ్‌సిల్లో జరుగుతున్న నాడు-నేడు మరమ్మతు పనులను ఈ సందర్భంగా పరిశీలించారు. మరమ్మతులు జరుగుతున్న నేపథ్యంలో వైద్య సేవలు అందజేయడంలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని వైద్య సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం ఆయన సీతమాంబపురంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని, ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సిహెచ్. అరుణ్‌కుమార్, సూపర్ వైజర్స్ బంగారుబాబు, లక్ష్మణ మూర్తి, ఆదిలక్ష్మి, వైద్య సిబ్బంది, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలు చేస్తున్న డిఐఒ జగన్మోహన్‌రావు

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి- పాలకొండ

స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం పదకొండవ రోజు తంపటాపల్లి డ్రాయింగ్ మాష్టర్ గొర్లె మురళి పాల్గొన్నారు. పనికిరాని వస్తువులతో బొమ్మలు ఎలా తయారు చేయాలో విద్యార్థిని, విద్యార్థులకు నేర్పించారు. ఇంఛార్జి గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం 11వ రోజు పిల్లలు గ్రంథాలయాలకు వచ్చి విజ్ఞాన పరమైన పరిజ్ఞానం పుస్తకాలు చదివారు. ఎక్కువ మంది విద్యార్థినులు పాల్గొన్నారు. సహాయకుడు రామకష్ణ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

సీతంపేట : భామిని మండలం బొడ్డగూడ ఆరిక మోహన్‌రావు (27) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో కుటుంబీకులు పిహెచ్‌సిలో చేర్పించారు. పరిస్థితి విషయమించడంతో సీతంపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు

భార్య తిట్టిందని భర్త ఆత్మహత్యాయత్నం

పార్వతీపురం రూరల్: మండలంలోని పెద్దబొండపల్లికి చెందిన యాళ్ల ధనుంజయ మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో గురువారం గ్రామంలో బంధువుల వివాహం ఉన్నందున అక్కడ తాగి పరువు తీయొద్దని భార్య మందలించింది. దీంతో ఇంట్లో ఉన్న మాత్రలను సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పాడ్డాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయిన అతన్ని గమనించిన కుటుంబీకులు జిల్లా ఆసుపత్రికి తరలించారు. అవుట్‌పోస్ట్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆటో బోల్తా , ముగ్గురికి గాయాలు

పార్వతీపురం రూరల్: కొమరాడ మండలంలోని మసిమండకు చెందిన ముగ్గురు మహిళలు ఆటో బోల్తా పడడంతో గాయాల పాలయ్యారు. పనుల నిమిత్తం కూనేరు వెళ్లి తిరిగి తమ స్వగ్రామానికి ఆటోలో వస్తుండగా తుమ్మలవలస మలుపులో ఆటో బోల్తా పడడంతో దానిలో ప్రయాణిస్తున్న తీల రమ, కద్రక ప్రియ, హిమరిఖ, ఈలమ్మ తీవ్రంగా గాయపడ్డారు. వీరికి రామభద్రపురం పిహెచ్‌సికి తరలించి, మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు.

పండగ ప్రశాంతంగా జరగాలి : ఆర్‌డిఒ

కలెక్టరేట్ : ఇప్పల పోలమ్మ అమ్మవారి పండుగ సందర్భంగా దర్శనాలు ప్రశాంతంగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని ఆర్‌డిఒ కె.హేమలత తెలిపారు. ఈనెల 28 నుంచి 30 వరకు మూడురోజుల పాటు నిర్వహించే ఇప్పల పోలమ్మ గ్రామ దేవత పండుగ సందర్భంగా ఊరేగింపు, దర్శనాలకు చేయాల్సిన ఏర్పాట్లపై ఆర్‌డిఒ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రతి మూడేళ్లకు జరిగే గ్రామదేవత పండుగ కోవిడ్ కారణంగా ఆరేళ్ల తర్వాత జరుపుతున్నందున ప్రజలు అధిక సంఖ్యలో హాజరవుతారని అన్నారు. కావున అన్ని శాఖలు కలిసి సమన్వయంతో పనిచేసి పండుగను విజయ వంతంగా నిర్వహించాలన్నారు. పండుగలో శాఖల వారీగా చేపట్టాల్సిన పనులను కేటాయించారు. మంచినీరు సరఫరా, శానిటేషన్ పనులు పంచాయతీరాజ్, మునిసిపల్ శాఖలు కలిసి చేయాలన్నారు. పండుగ మూడురోజులు మంచినీటి సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని, శివారు ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీరు పంపిణీ చేయాలని ఆదేశించారు. పంపుహౌస్ వద్ద కరెంటు ఇబ్బందుల్లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఉరేగింపు రూటు, సాధారణ ప్రజల ఆలయ దర్శనాలు, ముఖ్యుల దర్శనాలలో ఇబ్బందులు లేకుండా పోలీసు అధికారులు పర్యవేక్షించాలని, అందుకు అవసరమైన రూటుమ్యాపు వివరాలు పోలీసులకు అందించాలని పండుగ నిర్వాహకులకు సూచించారు. విద్యుత్ అధికారులు పండుగ మూడురోజులు విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని, రోడ్లుభవనాల శాఖ రథాలు తిరిగే రూట్లలో రోడ్డురిపేర్లు చేయాలన్నారు. పార్కింగు, రవాణా సదుపాయాలు, వైద్యశిబిరాలు ఏర్పాట్లు తదితర ఏర్పాట్లు ఆయాశాఖలు చూసుకోవాలని తెలిపారు. ప్రతి శాఖ వారు చేస్తున్న ఏర్పాట్ల వివరాలతో ఈనెల 27న నిర్వహించే సమావేశానికి హాజరుకావాలని తెలిపారు. సమావేశంలో సిఐ కృష్ణారావు, మున్సిపల్ కమిషనరు జె.రామ అప్పలనాయుడు, జిల్లా దేవాదాయశాఖ అధికారి డి.వి.వి.ప్రసాదరావు పాల్గొన్నారు.